ఏడాదిన్నరైనా 'అపెక్స్' మీటింగ్ ఏది?

నీటి పంపకాలు, ప్రాజెక్టులపై కౌన్సిల్ మీటింగ్‌ను సర్కారు ఎందుకు కోరడం లేదు?: నిరంజన్‌రెడ్డి

- సమావేశం పెట్టకుంటే అనుమతులెట్ల వస్తయ్?
- తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టే కుట్ర
- కృష్ణా నీళ్లలో ఇప్పటికీ తెలంగాణకు తీరని నష్టం
- బనకచర్ల కోసం సాగర్‌ను వెడల్పు చేస్తున్న ఏపీ
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా సాగునీటి పంపకాలు, ప్రాజెక్టుల గురించి అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కోరడం లేదు? అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. అపెక్స్ సమావేశం ఏర్పాటు చేయకుంటే ప్రాజెక్టులకు అనుమతులెలా వస్తాయి? అని నిలదీశారు. సాగునీటి విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాలని కాంగ్రెస్ సర్కారు కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఏపీకి సాగునీటిని తరలించుకు పోయే ప్రయత్నాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తున్నదని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించిన తర్వాతే బనకచర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించిందని, అఖిలపక్ష సమావేశంలో రాజకీయాలు మాట్లాడటం వల్లే బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమావేశం నుంచి బయటకు వచ్చారని తెలిపారు.

వద్దిరాజును కించపరిచిన రేవంత్

సచివాలయంలో బుధవారం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజును కించపరిచినట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని నిరంజన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. సీఎంకు ఈ విషయంలో ఏదో పాండిత్యం ఉన్నట్టు మాట్లాడారని ఎద్దేవాచేశారు. రాష్ట్రానికి ఏదో సాధించినట్టు సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ ఎంపీలు తెగ పొగడటం విడ్డూరమని విమర్శించారు. కేంద్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలనే ఒప్పందంగా చిత్రీకరించడం రేవంత్ అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని దెప్పిపొడిచారు.

'బనకచర్లను అడ్డుకుంటామని ఎందుకు చెప్పలే?

అఖిల పక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టును కచ్చితంగా అడ్డుకొని తీరుతామని ఎందుకు చెప్పడం లేదని నిరంజన్‌రెడ్డి నిలదీశారు. పాలమూరు కరువును రూపుమాపే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపిందని, మిగిలిన పనులు పూర్తి చేసి వెంటనే నీటి కేటాయింపులు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు.

సీఎం హోదాకు ఆ భాష తగదు

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష ఆయనకు అందంగా అనిపించవచ్చు గాని ముఖ్యమంత్రి హోదాకు అది తగదని నిరంజన్‌రెడ్డి సూచించారు. సీఎం మాట్లాడే భాష తన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నదని విమర్శించారు. కృష్ణా నీళ్ల విషయంలో తెలంగాణ ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని, తెలంగాణ పోరాటమే నీళ్ల కోసం జరిగిందని గుర్తుచేశారు. ఏపీలో కేవలం తెలుగు గంగకే నీటి కేటాయింపు ఉన్నదని, కానీ ఏపీలో 300 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం కృష్ణా నదిలో తగినంత నీరు అందుబాటులో లేదని వివరించారు.

కేసీఆర్ లేకుంటే.. రేవంత్ ఎక్కుడుండేవారు?

కేసీఆర్ లేకుంటే.. తెలంగాణ తేకుంటే.. రేవంత్‌రెడ్డి ఎక్కడ ఉండేవారు అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతి అంశంలో తెలంగాణను కించపరిచి అవహేళన చేసి మాట్లాడటం ఆయనకు తగదని హితవు పలికారు. అఖిల పక్ష సమావేశంలో రాజకీయాలు ఎలా మాట్లాడతారని నిలదీశారు. కృష్ణాబేసిన్‌కు కాళేశ్వరం ద్వారా గోదావరి నీటిని తరలించాలన్న ఆలోచన కేసీఆర్‌కు ఉన్నదని, తెలంగాణ ప్రయోజనాలు, ఇక్కడి అవసరాలు తీరిన తర్వాతే మిగిలిన ప్రాంతాలకు సాగునీరిస్తామని కేసీఆర్ అన్నారని, దీనికి తాను ఎన్నటికీ కట్టుబడే ఉంటానని స్పష్టంచేశారు.

నాగార్జున సాగర్‌ను వెడల్పు చేస్తున్న ఏపీ

బనకచర్ల ప్రాజెక్టు కోసం నాగార్జున సాగర్ కాలువలను ఏపీ సర్కారు వెడల్పు చేస్తున్నదని, ఇది రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకమని, ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా నిలదీయడం లేదని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్టుకు ఎలాంటి ఫీజిబులిటీ లేకున్నా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించగానే రూ.82,000 కోట్లు ఖర్చయ్యే పథకానికి ఏకంగా 50 శాతం భరిస్తామని హామీ ఇవ్వడం దేనికి నిదర్శనమని, తెలంగాణ మీద బీజేపీకి ఉన్న కక్షకు ఇది నిదర్శనం కాదా? అని మండిపడ్డారు. ఇది తెలంగాణకు గొడ్డలిపెట్టు అని ఫైర్ అయ్యారు. ఈ విషయంలో కనీసం తెలంగాణను సంప్రదించాలన్న ఉద్దేశం కూడా కేంద్రానికి లేదని, నదుల అనుసంధానం కింద ఇది ఇంటిగ్రేట్ అవుతుందని ఏపీ సర్కారు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించుకున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం మీద తప్ప తెలంగాణ ప్రజల ప్రయోజనాల మీద దృష్టి లేదని ఫైర్ అయ్యారు.

నీటి ప్రాజెక్టుల మీద కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి మీద, నీటి ప్రాజెక్టుల మీద, పరివాహక ప్రాంతాల మీద కనీస అవగాహన, చిత్తశుద్ధి లేదని నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'పదేండ్లలో పూర్తి చేసిన ప్రాజెక్టుల గురించి చెప్పమని అడుగుతున్నారు కదా ? అసలు తెలంగాణలో ప్రాజెక్టులను పూర్తి చేసిందే కేసీఆర్ ప్రభుత్వం.. పాలమూరులో నాలుగు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వం.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు కాంగ్రెస్ పార్టీ అనేక అడ్డంకులు వేసినా రూ.32,500 కోట్లతో పనులు చేసింది కేసీఆర్ ప్రభుత్వం' అని స్పష్టంచేశారు. మిగిలిన పనులు పూర్తి చేయకుండా రేవంత్‌రెడ్డి ఏడాదిన్నరగా కాలయాపన చేస్తున్నారని, పాలమూరు ఎత్తిపోతల పనులను ఏ కారణం చేత ఎందుకు ఆపారో ? ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్లు లేని చోట కొడంగల్ ఎత్తిపోతల చేపట్టారని మరి దాని భవిష్యత్తు ఏమవుతుందో వేచిచూడాలని అనుమానం వ్యక్తంచేశారు. ప్రభుత్వం చేతగానితనాన్ని, ఏపీకి అనుకూలంగా ఉన్న తమ ప్రభుత్వ వైఖరిని కప్పిపుచ్చుకొనేందుకు కేసీఆర్‌పై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై నెపం నెడుతున్నారని, రేవంత్ వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులూ హర్షించరని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలకే బీఆర్‌ఎస్, కేసీఆర్ కట్టుబడి ఉన్నారని స్పష్టంచేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ పాల్గొన్నారు.

తెలంగాణను కించపరిచేలా ముఖ్యమంత్రి మాటలు

> కేంద్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలనే ఒప్పందంగా చిత్రీకరించడం సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. ఆ సమావేశంలో ఎవరు ఏం మాట్లాడినా రికార్డ్ చేస్తారన్న విషయం తెలియకపోవడం విడ్డూరంగా ఉన్నది. బనకచర్ల ప్రాజెక్టును కచ్చితంగా అడ్డుకొని తీరుతామని అఖిల పక్ష సమావేశంలో సీఎం రేవంత్ ఎందుకు స్పష్టంగా చెప్పలేదు?
>
> -మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

> ప్రతి అంశంలో తెలంగాణను కించపరిచి, హేళన చేసి మాట్లాడటం సీఎం రేవంత్‌కు తగదు. ఆయనకు ఏదో మానసిక రుగ్మత ఉన్నట్టు అనిపిస్తున్నది. అఖిలపక్షంలో ప్రతిపక్ష పార్టీలకు ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో చెప్పాలి గాని.. అధికారుల ముందు రాజకీయాలు ఎలా మాట్లాడతరు? కృష్ణా బేసిన్‌కు కాళేశ్వరం ద్వారా గోదావరి నీటిని తరలించాలన్న ఆలోచన కేసీఆర్‌కు ఉన్నది. తెలంగాణ అవసరాలు తీరిన తర్వాత మిగిలిన ప్రాంతాలకు నీరిస్తామనే కేసీఆర్ అన్నరు.
>
> -మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు

> పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.32,500 కోట్లు ఖర్చు చేసింది. ఇక్కడ కేవలం 172 ఎకరాలను మాత్రమే సేకరించాల్సి ఉన్నది. ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయ్యాయి. పాలమూరు కరువును శాశ్వతంగా రూపుమాపే పథకం డీపీఆర్‌ను కేంద్రం వెనక్కి పంపింది. మిగిలిన పనులు పూర్తి చేసి వెంటనే నీటి కేటాయింపులు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పట్టించుకోవడం లేదు.
>
> -మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కృష్ణా నీళ్లను తరలించొద్దని ఎందుకు లేఖ రాయలే?

'గోదావరి నుంచి బనకచర్లకు నీటిని తీసుకుపోతున్న నేపథ్యంలో ఇప్పటికే కృష్ణా నుంచి నీళ్లను తరలించుకుపోతున్నందున ఇక మీదట కృష్ణా నీళ్లు తీసుకుపోవద్దని చంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు లేఖ రాయడం లేదు ? ప్రభుత్వానికి ఒక విధానం అంటూ ఏదీ లేదా? ఇప్పటి వరకు తీసుకువెళ్తున్న నీళ్లను బంద్ పెట్టాలని ఎందుకు అడగడం లేదు?' అని నిరంజన్‌రెడ్డి నిలదీశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతున్నారని, నిజంగా ఉరితీయాల్సి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ఉరితీయాలని విరుచుకుపడ్డారు. ఎన్నికల హామీలు ఎగ్గొట్టినందుకు, పచ్చబడ్డ తెలంగాణను ఎండబెట్టినందుకు, రూ.15 వేల రైతు భరోసాకు ఎగనామం పెట్టినందుకు, రూ.4000 వేల పింఛన్ ఇవ్వనందుకు, క్వింటాకు రూ.500 బోనస్ ఎగ్గొట్టినందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ఉరితీయాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2 లక్షల ఉద్యోగాలు ఏడాదిలోగా ఇస్తామని చెప్పి ఇవ్వనందుకు.. ప్రభుత్వాన్ని నిరుద్యోగులు ఉరితీయాలని, స్కూటీలు ఇస్తామని చెప్పి ఇవ్వనందుకు విద్యార్థినులు ఈ ప్రభుత్వాన్ని ఉరితీయాలని తూర్పారబట్టారు.

● కేసీఆర్‌ను వదులుకొని బాధపడుతున్న రైతులు

ఏ ప్రాజెక్టు, ఏ నది నుంచి ఎన్ని నీళ్లు వస్తాయో పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్‌ను వదులుకున్నామని తెలంగాణ రైతులు ఇప్పుడు బాధపడుతున్నారని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి ఈ రాష్ట్ర సాగునీటి అవసరాల గురించి ఏ మాత్రం అవగాహన లేదని, మీడియా సమావేశంలో రేవంత్ అడ్డగోలుగా మాట్లాడుతుంటే మంత్రులు వారించరా? అని నిలదీశారు. నిజంగా రేవంత్‌రెడ్డి పాలమూరు బిడ్డ అయితే.. ఇన్నేళ్లూ తాము సాగునీళ్లు కోల్పోయినం.. ఇకనైనా నీళ్లను కేటాయించాలని అధికారంలోకి వచ్చిన మొదటి రోజే కేంద్రానికి లేఖ రాయాల్సింది కదా? అని నిలదీశారు.

బనకచర్లపై రేవంత్‌రెడ్డి చౌకబారు వ్యాఖ్యలు

- అఖిలపక్షం ప్రజల కోసం కాదు
- వారికి శిక్షణ కోసమే ఏర్పాటు
- బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): బనకచర్ల ప్రాజెక్టుపై, గోదావరి నదీజలాల వినియోగంపై సీఎం రేవంత్‌రెడ్డి చౌకబారు వ్యాఖ్యలు చేశారు.. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై ఆయన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం.. అని బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. గోదావరిపై తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఏపీ సర్కారు కుట్రపూరితంగా బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నదని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ప్రజలకేదో నిజాలు తెలియజేయడానికి, ఆంధ్రా ప్రభుత్వ కుట్రలు బట్టబయలు చేయడానికి పెట్టినట్టుగా లేదని, అది సీఎం, మంత్రులు, అధికారుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. తాను నల్లమల అడవుల్లో పుట్టినట్టుగా తొడలు కొట్టుకున్న రేవంత్‌రెడ్డి.. ఆ నల్లమల అడవి తెలంగాణ కిందకు వస్తదా? రాయలసీమ కిందకు వస్తదా? అం టూ కనీసం అవగాహన లేకుండా మాట్లాడారని విమర్శించారు. పిల్లల మాదిరి సందేహాలు అడుగుతూ రేవంత్‌రెడ్డి అభాసుపాలు అయ్యారని దు య్యబట్టారు. వాళ్లకు సాగునీటి ప్రాజెక్టుల మీద అవగాహన కావాలన్నా.. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పదనం తెలియలన్నా, బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు వాటిల్లే నష్టం తెలియాలన్నా.. బీఆర్‌ఎస్ భవన్‌లో ఒక వారం కేసీఆర్ చేత శిక్షణ తరగతులు తీసుకుంటే మంచిదని హితవు పలికారు. అప్పుడే కాంగ్రెస్ వాళ్లకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

బనకచర్ల ప్రాజెక్టు ఏపీకి గుదిబండ

- జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి

హైదరాబాద్, జూన్ 19 (నమస్తేతెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం-బనకచర్ల భారీ ప్రాజెక్టు ఆ రాష్ట్ర ప్రజలకు గుదిబండగా మారుతుందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.81, 900 కోట్లని, భవిష్యత్తులో రూ.2 లక్షల కోట్లకు పెరిగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను మరింత అప్పుల పాలు చేయొద్దని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పోలవరం, వెలుగొండ, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా అన్నమయ్య, జరికోన, పింఛ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర ప్రాజెక్టులు గత 30 ఏండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. వాటి ని పూర్తి చేయకుండా మరో భారీ ప్రాజెక్టును ప్రతిపాదించడం రాష్ట్రానికే మంచిది కాదని హితవు పలికారు. కేవ లం కమిషన్ల కోసమే బనకచర్ల ప్రాజెక్టును నిర్మించవద్దని హెచ్చరించారు.

తెలంగాణ ప్రయోజనాలు ఏపీకి తాకట్టు!

- ఏమీ తెలియని వ్యక్తి సీఎం కావడం మనఖర్మ
- బీఆర్‌ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా అధ్యక్షుడు నాగరాజు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతూ, ఏపీ సాగునీటి దోపిడీకి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తున్నదని బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ సౌతాఫ్రికా ప్రెసిడెంట్ నాగరాజు గుర్రాల గురువారం ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి సాగునీటి ప్రాజెక్టులపై పరిజ్ఞానం లేదని విమర్శించారు. 'దేవాదుల ప్రాజెక్టు గోదావరి బేసిన్‌లో ఉన్న దా? బనకచర్ల ఎక్కడున్నది? ఏ బేసిన్ పరిధిలోకి వస్తుంది? ఏ నదులను అనుసంధారిస్తున్నారు? నల్లమల ఎక్కడుంది? అది ఏపీలోనా? తెలంగాణలోనా?' అనే ప్రాథమిక ప్రశ్నలకు కూడా సమాధానం తెలియని వ్యక్తి తెలంగాణకు సీఎం కావడం రాష్ట్ర ప్రజల ఖర్మ అని ఎద్దేవా చేశారు. అఖిలపక్ష సమావేశంలో సీఎం మాట్లాడిన మాటలు.. ఆయన వైఖరిని స్పష్టం చేశాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి యాదృచ్ఛికంగా తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యారే కానీ, ప్రజలు అయనను నేరుగా ఎన్నుకోలేదని తేల్చిచెప్పారు. తెలంగాణ అస్తిత్వం కోసం నిజమైన పోరాటం చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని, నిస్సహాయ పరిస్థితుల నుంచి తెలంగాణను కాపాడేందుకు ఆయన రంగంలోకి రావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై రాష్ట్ర ప్రజలు ఐక్యంగా పోరాడి తెలంగాణ వాటా జలాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

బాబ్లీ బాబు.. బనకచర్ల డాబు!

అది.. 2010, జూన్ 16.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధాన ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తన పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలు, 45 మంది ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో కలిసి.. ఏపీ-మహారాష్ట్ర సరిహద్దులోని బాబ్లీ ప్రాజెక్టు వద్ద నిరసన తెలిపేందుకు బయలుదేరారు. ప్రాజెక్టు వద్ద నిషేధాజ్ఞల వల్ల మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ పోలీసులు బాబు బృందాన్ని అడ్డుకున్నారు. అయినప్పటికీ బాబు బృందం ససేమిరా అనడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఒకవైపు అక్కడే చంద్రబాబుతో పాటు టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిరసనకు దిగగా.. మరోవైపు బాబు వైఖరికి నిరసనగా ధర్మాబాద్‌వాసులు బంద్‌కు పిలుపునిచ్చారు. ఇలా రెండురోజుల పాటు అక్కడ భారీ హైడ్రామా చోటుచేసుకుంది.

- గతంలో బాబ్లీ బాబు డ్రామా ఇది.

ప్రస్తుతం 2025 జూన్, 19.. అమరావతిలో ఏపీ సీఎం చంద్రబాబు మీడియా సమావేశం.. 'గోదావరిపై ఒక్క పోలవరం తప్ప మిగిలినవన్నీ అనుమతిలేని ప్రాజెక్టులే. గోదావరిలో నీళ్లు ఉన్నాయి. పోరాటం అవసరం లేదు. తెలంగాణ కట్టే ప్రాజెక్టులన్నీ కట్టి నీళ్లు వాడుకుంటే చాలు. ఎందుకు పోరాటం? దేనికోసం పోరాటం? ప్రాజెక్టులు కట్టండి.. కట్టి నీళ్లు తీసుకోండి. ఉమ్మడి ఏపీలో దేవాదుల ప్రాజెక్టును నేనే మొదలుపెట్టిన. ఎస్సెల్బీసీ సక్సెస్ అయిన తర్వాత కల్వకుర్తి మొదలుపెట్టా. కాళేశ్వరం కట్టుకుంటే నేనెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. పైనుంచి నీళ్లు వాడుకుంటే నష్టమా? కింద ఉండి నీళ్లు వాడుకుంటే నష్టమా? సముద్రంలోకి వెళ్లే నీళ్లు. మీరు పైన నీళ్లు వాడకపోతేనే కిందకొస్తాయి. కానీ నెనెప్పుడూ ఈ పాయింట్ ఎత్తి చూపలేదు. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సముద్రంలోకి వెళ్లే నీళ్లు మీరు వాడుకుంటున్నారు వాడుకోండి. దీనికి మీకు చట్టబద్ధత కావాలంటే కేంద్రంతో కూర్చుని మాట్లాడుకుందాం. అంతేగానీ ఇష్యూ చేయడం ఎందుకు? మనం గొడవ పడుతూ ప్రజల్ని మభ్య పెట్టడం, మోసం చేయడం వల్ల లాభం లేదు.'

- బనకచర్ల బాబు హైడ్రామాలో భాగంగా నీతి ప్రవచనాలు ఇవి.

- రెండు కండ్లు.. రెండు నాల్కలు!
- సముద్రంలో కలిసే వృథా నీళ్లతోనే బనకచర్ల అంటున్న ఏపీ సీఎం
- రెండు వేల టీఎంసీల్లో కేవలం 200 టీఎంసీలే వాడుకుంటారట
- అదే నిజమైతే నాడు 2.7 టీఎంసీల బాబ్లీ ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకించినట్టు?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 19 (నమస్తే తెలంగాణ): శ్రీరాంసాగర్ ఎగువన నిర్మించిన బాబ్లీ సామర్థ్యం 2.7 టీఎంసీలు! బనకచర్ల సామర్థ్యం 200 టీఎంసీలు!! మరి.. ప్రతి ఏటా రెండు వేల టీఎంసీలకు పైగా గోదావరిజలాలు సముద్రంలో కలుస్తుంటే నాడు చంద్రబాబు బాబ్లీని ఎందుకు వ్యతిరేకించారు? బాబ్లీ ఆంధ్రప్రదేశ్‌కు ఎగువన ఉన్న మహారాష్ట్రలో ఉంది. సముద్రంలో ఎలాగూ 2వేల టీఎంసీలు కలుస్తుంటే 2.7 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న బాబ్లీతో వచ్చిన సమస్య ఏంది? అప్పటికే ఎనిమిదేండ్లు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహించారు... 2010 నాటికి ఆరేండ్ల పాటు ప్రధాన ప్రతిపక్ష నేత హోదాను సైతం పూర్తి చేసుకున్నారు. బాబ్లీని వ్యతిరేకించి.. పొరుగు రాష్ట్రంలోకి ప్రవేశించి.. నానా హంగామా చేసి.. చివరకు తనతో మహారాష్ట్ర పోలీసులు దురుసుగా వ్యవహరించారంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబుకు రెండువేల టీఎంసీల గోదావరిజలాలు సముద్రంలో కలుస్తున్నాయన్న విషయం తెల్వకుండా ఉంటుందా? అయినప్పటికీ పొరుగు రాష్ట్రంలో గాయిగాయి చేసి ఇప్పుడు బనకచర్ల దగ్గరికొచ్చేసరికి మాత్రం ఉప్పునీటిలో కలిసే వృథాజలాలంటూ ప్రవచనాలు వల్లించడమంటే రెండు కండ్ల బాబు రెండు నాల్కల్ని ఎలా మడతేస్తారో అర్థం చేసుకోవచ్చు. నాడు ఉమ్మడి రాష్ట్రంలోనైనా.. నేడు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిగానైనా.. చంద్రబాబు తెలంగాణకు బద్ధవ్యతిరేకి అనేది నిజం. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించడమే ఆయన జీవిత లక్ష్యం అనేది అక్షర సత్యం. ముఖ్యంగా 2010, జూలై రెండో తేదీన అంటే బాబు బాబ్లీ డ్రామా కంటే 14 రోజుల ముందు తెలంగాణలో 12 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఆ సీట్లన్నీ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణ పరిధిలోనివే. అక్కడ ఓట్లు దండుకోవడానికి ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నంలో భాగంగానే బాబు బాబ్లీ డ్రామాను రక్తి కట్టించాలని చూశారు. తెలంగాణ రైతులకు సాగునీరు అందించడమనే బృహత్తర బాధ్యతను సమైక్య పాలకులు కేవలం ఓట్ల కోసమే వాడుకుంటారని చంద్రబాబు బాబ్లీ డ్రామా రూపంలో బహిరంగంగా రుజువు చేశారు.

రాజనీతిజ్ఞతతోనే గట్టెక్కనున్న ప్రాజెక్టులు

బండ కింద చెయ్యి పడితే ఏం చేస్తాం? నెమ్మదిగా గాయం కాకుండా తీసుకునేందుకు ప్రయత్నిస్తాంగానీ ఒక్కసారిగా గుంజుకోం కదా! దానినే ఒడుపు అంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో సమైక్య పాలకులు ఎన్నడూ ఆ ఒడుపును ప్రదర్శించలేదు. ఎందుకంటే.. బండకింద ఉన్నది వాళ్ల చెయ్యి కాదు! తెలంగాణ రైతుల బతుకులు! అందుకే నిత్యం ఇటు కృష్ణాలో ఎగువన ఉన్న కర్ణాటక-మహారాష్ట్ర.. అటు గోదావరిలో ఎగువన ఉన్న మహారాష్ట్రతో గొడవలే. దాని ఫలితంగానే తెలంగాణను సస్యశ్యామలం చేయాల్సిన కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు అంతర్రాష్ట్ర చిక్కుముళ్లతో దశాబ్దాలుగా కాగితాలపైనే నానిపోయాయి. చంద్రబాబు బాబ్లీలాంటి డ్రామాలతో అగ్గికి ఆజ్యం పోశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మహారాష్ట్రతో కనీసం సంప్రదించకుండానే టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టడంతో 2013లో అప్పటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చౌహాన్ ఏపీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘాటుగా లేఖ రాశారు. ఒక అంతర్రాష్ట్ర ప్రాజెక్టుపై.. అందునా పొరుగు రాష్ట్ర భూభాగంలో బరాజ్ డిజైన్ చేసి.. వారిని సంప్రదించకుండానే పనులు చేయడమంటే పొరుగు రాష్ట్రాన్ని రెచ్చగొట్టడమే. వాస్తవానికి సమైక్య పాలకుల వ్యూహమే అది. ఈ మర్మాన్ని గుర్తించినందునే కేసీఆర్ తెలంగాణ ఏర్పడిన తర్వాత రాజనీతిజ్ఞత ప్రదర్శించారు. ప్రధానంగా మహారాష్ట్రతో సత్సంబంధాన్ని కొనసాగించి ఒకేరోజు 3 అంతర్రాష్ట్ర ప్రాజెక్టులపై చారిత్రక ఒప్పందం చేసుకున్నారు. అయితే 2014-2019 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నిత్యం తెలంగాణలోని కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై కృష్ణా-గోదావరి బోర్డులకు, కేంద్ర జలశక్తికి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు.

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాబ్లీ ప్రాజెక్టు ముట్టడి సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న చంద్రబాబు. చిత్రంలో నాటి మంత్రులు దేవేందర్‌గౌడ్, నర్సింహులు, అశోక్‌గజపతిరాజు

కేసీఆర్ రాజనీతిజ్ఞత

ఈ క్రమంలో 2019లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం.. అప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించుకోవాల్సి ఉన్నందున కేసీఆర్ సామరస్య వాతావరణం కోసం ప్రయత్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్రాష్ట్ర వివాదంలో పడిపోకుండా ఉండేందుకు అప్పటి సీఎం జగన్‌ను ఆహ్వానించి.. గోదావరిలో పుష్కలంగా ఉన్న నీటిని రెండు రాష్ట్రాలు వాడుకుందామని హితవు పలికారు. ఏపీ కలిసొస్తుందా లేదా అనేది తర్వాత సంగతి. కానీ కాళేశ్వరంపై జగన్ ప్రభుత్వం తదుపరి ఫిర్యాదులు చేయకుండా ఉండేందుకు రాజనీతిజ్ఞత ప్రదర్శించారు. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు పైనా చంద్రబాబు ఇదేరీతిన స్పందిస్తున్నారు.

కాళేశ్వరంపై చంద్రబాబు బుకాయింపు

'గోదావరి వరద జలాలనే వాడుకుంటున్నాం. తెలంగాణ ప్రాజెక్టులకు నేను ఎన్నడూ అడ్డుచెప్పలేదు. ఇతర రాష్ట్రాలు బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డు చెప్పడం లేదు' అని చంద్రబాబు చెప్తున్న మాటలన్నీ పచ్చి అబద్ధాలే. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతి ప్రాజెక్టుపై కేంద్రానికి ఫిర్యాదుచేసి అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు. 'తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ అనుమతులిచ్చిందని మా దృష్టికి వచ్చింది. ఆ ప్రాజెక్టుపై ఏపీ ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్, జీఆర్‌ఎంబీ అనుమతులు తీసుకోకుండానే ప్రాజెక్టును చేపట్టింది. ఇది ఏపీ ప్రయోజనాలను ప్రభావితం చేస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన అన్ని అనుమతులను రద్దుచేయండి. ప్రాజెక్టు పనులు నిలిపివేయించాలి' అంటూ 2018 జూన్ 13న కేంద్రానికి చంద్రబాబు సర్కారు కేంద్రానికి లేఖ రాసింది. అదేవిధంగా భక్త రామదాసు ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి, డిండి, తుమ్మిళ్ల, కల్వకుర్తి, నెట్టెంపాడు, సుంకిశాల ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కేంద్ర జలవనరుల శాఖ, కేఆర్‌ఎంబీ, సీడబ్ల్యూసీకి ఏపీ సర్కారు అనేక లేఖలు రాసింది. 'తెలంగాణ శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులపై జలశక్తి మంత్రి జోక్యం చేసుకోవాలి. ఆ ప్రాజెక్టులను నిలువరించాలి' అని ఉమాభారతికి చంద్రబాబు లేఖ రాశారు.

ఆ 200 టీఎంసీలు తెలంగాణకూ ఇవ్వాలి

- కృష్ణాలో అదనపు కేటాయింపులు చేయాలి
- రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే.. ఆ ప్రాజెక్టుతో తరలించి నీటికి సమానంగా తెలంగాణకు కృష్ణా నదిలో నీళ్లను కేటాయించాలని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ (టీఆర్‌ఈఏ) డిమాండ్ చేసింది. గురువారం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేరెడ్డి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, తన్నీరు వెంకటేశం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలచేశారు. 'గోదావరి నుంచి బనకచర్లకు 200 టీఎంసీలను పెన్నా బేసిన్‌కు తరలించాలని ప్రతిపాదిస్తున్నారు. అయితే, అందుకు బదులుగా 200 టీఎంసీలను తెలంగాణకు కృష్ణాలో అదనంగా కేటాయించాలి. గోదావరి, దాని ఉపనదులపై తెలంగాణ చేపట్టిన, పూర్తయిన, కొనసాగుతున్న, భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం నికర జలాలను కేటాయించాలి' అని డిమాండ్ చేశారు. అన్ని అనుమతులు వచ్చిన తర్వాతే ఏపీ జీబీ లింక్ ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలుత గోదావరి బోర్డు డీపీఆర్‌ను పరిశీలించాలని, దానిని సీడబ్ల్యూసీకి పంపిన తరువాత అక్కడినుంచి హైడ్రలాజికల్ అనుమతులు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆ అనుమతులు వచ్చాక అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి ఆమోదం పొందిన తరువాతే ప్రాజెక్టును చేపట్టాలని సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టును కేంద్రమే చేపట్టి త్వరగా పూర్తిచేస్తే రెండు రాష్ట్రాలకూ ఆర్థిక భారం తప్పుతుందని పేర్కొన్నారు.

24న టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ వాయిదా

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపై 24వ తేదీన బేసిన్ రాష్ట్రాలతో నిర్వహించతలపెట్టిన కన్సల్టెన్సీ మీటింగ్ వాయిదా పడింది. ఈ మేరకు రాష్ట్రాలకు ఎన్‌డబ్ల్యూడీఏ గురువారం సమాచారం అందించింది.

తెలంగాణ బంగారు గని!

- ఇరు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకోవాలి
- నీళ్ల కోసం పోరాటం అవసరం లేదు
- బనకచర్ల వివాదంపై చంద్రబాబు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బంగారు గని అని రెండు తెలుగు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకొనే ధోరణి అవలంబించాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలో ఆయన గురువారం విలేకరులతో బనకచర్ల వివాదంపై మాట్లాడారు. 'మీరు పైన నీళ్ల వాడకపోతే అవి కిందికొస్తాయి. ప్రాజెక్టులు కట్టండి.. నీళ్లు తీసుకోండి' అని తెలంగాణ కాంగ్రెస్ సర్కారుకు సూచించారు. నీళ్ల కోసం పోరాటం అవసరం లేదన్నారు. కొట్టుకుంటే లాభం లేదన్నారు. సముద్రంలోకి వెళ్తున్న నీళ్లను మాత్రమే తాము వాడుకుంటున్నట్టు పునరుద్ఘాటించారు. గోదావరి నీళ్లను తాము మరో బేసిన్‌కు తీసుకెళ్తుంటే.. తెలంగాణ ఇంకో బేసిన్‌కు తీసుకుళ్తున్నదని చెప్పారు. దీనివల్ల తెలంగాణకు వచ్చే నష్టం ఏమిటని ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రభుత్వం నిర్మించే ప్రాజెక్టులను పూర్తిచేసి వాళ్ల నీళ్లు వాళ్లు వాడుకుంటే చాలు' అని వ్యాఖ్యానించారు. పైన ఉండి నీళ్లు వాడుకుంటే నష్టమా? కింద ఉండి నీళ్లు వాడుకుంటే నష్టమా? అని ప్రశ్నించారు. తాము సముద్రంలోకి వెళ్లే వృథా జలాలపైనే బనకచర్ల నిర్మిస్తున్నట్టు తెలిపారు. గోదావరిలో నీళ్లు ఉన్నాయి కాబట్టి తెలంగాణ, ఏపీ వాడుకుంటున్నాయని అన్నా రు. తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే తానెప్పుడూ అభ్యంతరం చెప్పలేదన్నారు.